## అభివృద్ధి ట్రాక్‌లోకి వచ్చింది.. పెట్టుబడులు, ఉద్యోగాలు పెరిగాయి : సీఎం చంద్రబాబు



**పెనుగొండ, జూన్-08, (ప్రభాతవార్త)** రాష్ట్రంలో అభివృద్ధిని ట్రాక్‌లో పెట్టామని, అందువల్ల భారీ స్థాయిలో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అన్నారు. సోమవారం పెనుగొండ మండలం సిద్ధాంతంలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తోందని సీఎం తెలిపారు. సూపర్ సిక్స్ హామీలకంటే అదనంగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్లు, మత్స్యకారులకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వస్తున్నాయని, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. డీఎస్సీ ద్వారా దాదాపు 16 వేల మంది ఉపాధ్యాయులకు ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ, గత పాలకులు ఉద్యోగాల విషయంలో యువతను మోసం చేశారని ఆరోపించారు. భూ రికార్డుల అక్రమాలు, అవినీతి అంశాలపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజలు బాధ్యతాయుత నిర్ణయాలు తీసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

### రెవెన్యూ శాఖలో సమూల మార్పులు
# తీసుకువస్తున్నాం
### సీఎం చంద్రబాబు నాయుడు



**పెనుగొండ, జూన్-08, (ప్రభాతవార్త)** వివాదాలు లేకుండా రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకు వస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన మీ భూమి మీ హక్కు గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామన్నారు. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామన్నారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశాం. రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామన్నారు. అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే చాలన్నారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రారంభించామన్నారు. 9 (2) నోటీసుల జారీ సమయంలో కూడా ఈ-కేవైసీ అమలు చేస్తున్నామన్నారు. 80 శాతం ఈ-కేవైసీ పూర్తయిన తర్వాతనే గ్రామాలను వెబ్‌ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. అన్నదాత సుఖీభవ కింద 3 విడతల్లో 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ చేశామన్నారు. గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు, చెరువుల మరమ్మతులు, నిర్వహణ సమర్థవంతంగా చేస్తున్నామన్నారు. ఆక్వా రంగం రాష్ట్రానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకం. ఆక్వా రంగానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.
పశ్చిమగోదావరి పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు వస్తాయన్నారు. పశ్చిమాసియా యుద్ధం సహా వేర్వేరు అంశాల కారణంగా ఆక్వా రైతులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఆక్వా ఫీడ్ రేట్లు కూడా పెరిగాయని, ఈ అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే కేంద్ర నిర్ణయం వస్తుందన్నారు.



## అత్యంత పారదర్శకంగా..
## పట్టాదారు పాస్ పుస్తకాలు
# జారీ చేస్తున్నాం...
### సీఎం చంద్రబాబు నాయుడు





**పెనుగొండ, జూన్-08, (ప్రభాతవార్త)** కరెన్సీ నోట్లు ఉన్న ఫీచర్లు మాదిరిగా పట్టాదారు పాసుపుస్తకాలు కూడా అంతే భద్రతతో రైతులకు జారీ చేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా వాసవి పెనుగొండ మండలం సిద్ధాంతంలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం అలరారే ఉమ్మడి పశ్చిమగోదావరి- తూర్పుగోదావరి జిల్లాలు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా మారాయన్నారు. భూమిని పూర్తిగా సద్వినియోగం చేసుకుని పంటలు పండించే రైతులు, ఈ ప్రాంత ప్రజలు చాలా సహృదయులని కొనియాడారు. వివాదాలు లేని ఈ ప్రాంతంలో గత పాలకులు చిచ్చు పెట్టి భూవివాదాలు సృష్టించారు. రికార్డులు తారుమారు చేశారని విమర్శించారు. ఈ ప్రాంతంలో బ్రిటిషర్లు నిర్వహించిన రికార్డుల కారణంగా ఏపీలో రెవెన్యూ సమస్యలు తక్కువగా ఉండేవని అన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకం కారణంగా అంతా గందరగోళంగా మారింది. ప్రజల భూముల విషయంలో సమస్యలు సృష్టించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి భూమి కాజేసేందుకు గత పాలకులు ప్రయత్నాలు చేశారు ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూమి రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారు. మేం అధికారంలోకి వచ్చాక ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తక్షణం రద్దు చేసి భూమి యాజమాన్య హక్కుల్ని రక్షించామని అన్నారు. భూమి మీదైతే ఫోటోలు వారివి ముద్రించుకున్నారని, పొలం సరిహద్దు రాళ్లపై కూడా బొమ్మలు ముద్రించుకున్నారని దుయ్యబట్టారు. భూతం తరహాలో రైతుల వెంటపడి రూ.800 కోట్లు పెట్టి గెలాక్సీ గ్రానైట్ రాళ్లపై బొమ్మలు వేసుకున్నారన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సహా క్యూఆర్ కోడ్ లాంటి పటిష్టమైన చర్యలతో పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాంమని అన్నారు. చిత్తూరు జిల్లాలో ఏళ్లుగా వివాదాల్లో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూముల్ని పరిష్కరించి వారికి అప్పగించాంమన్నారు.









## వీరాభిమాని కోరిక తీర్చిన సీఎం చంద్రబాబు..
### ఇల్లు, వైద్యసాయం అందించాలని ఆదేశాలు





**ఆచంట, జూన్-08, (ప్రభాతవార్త),** పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం కామధేనువులంక గ్రామానికి చెందిన వృద్ధుడు సత్యనారాయణ ఎన్నాళ్లుగానో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ప్రత్యక్షంగా చూడాలనే కోరికను వ్యక్తం చేశారు. చంద్రబాబు తమ ప్రాంతానికి వస్తున్నారని తెలిసి, దూరం నుంచైనా చూడాలని ఆయన చెప్పిన వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఆ వీడియో ముఖ్యమంత్రి దృష్టికి చేరడంతో "సత్యనారాయణ గారూ.. సిద్ధాంతంలో కలుద్దాం" అంటూ స్పందించారు. ఈ నేపథ్యంలో సోమవారం సిద్ధాంతం గ్రామంలో నిర్వహించిన "మీ భూమి -- మీ హక్కు" కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కార్యక్రమం ముగిసిన అనంతరం సత్యనారాయణను ప్రత్యేకంగా తన బస్సులోకి పిలిపించుకున్నారు. ఆయనతో ఆత్మీయంగా మాట్లాడి కుటుంబ పరిస్థితులు, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అతనికి వైద్యసాయం అందించాలని సత్యనారాయణ ముఖ్యమంత్రిని కోరారు. అలాగే కామధేనువులంక గ్రామానికి డ్రైనేజ్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సత్యనారాయణ అభ్యర్థనలకు స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడికి అవసరమైన వైద్యసాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా సత్యనారాయణకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి చూపిన ఆప్యాయత, తక్షణ స్పందనతో సత్యనారాయణ ఆనందం వ్యక్తం చేశారు. స్థానికులు కూడా ఈ ఘటనను అభినందించారు.



## సిద్ధాంతం గ్రామానికి సీఎం చంద్రబాబు వరాల జల్లు





**పెనుగొండ, జూన్-08, (ప్రభాతవార్త)** ఆచంట నియోజకవర్గం, పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో సోమవారం జరిగిన పట్టాదారు పాస్ పుస్తకాల కార్యక్రమంలో సిద్ధాంతం గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరాలు కురిపించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కోరిక మేరకు వచ్చే ఏడాది జరగబోవు పుష్కరాలకు ఈ నిధులు ప్రభుత్వం ఖర్చు చేయనుంది. అవి ఇక్కడే విధంగా ఉన్నాయి.
సిద్ధాంతం గోదావరి సమీపాన ఉన్న శ్రీ కేదారేశ్వర స్వామి శ్రీ రమా సత్యనారాయణ స్వామి వార్ల ఆలయ నిర్మాణం కొరకు రూ ? 4 కోట్లు , అక్కడే కొత్త స్నానాలు రేవు నిర్మించుకొనుటకు , మరమ్మత్తులు చేయుటకు ? 3.00 కోట్లు , బ్యాంకు కెనాలపై ఉన్న బ్రిడ్జిని తొలగించి కొత్తగా నిర్మాణం చేయుట కొరకు ? 4.00 కోట్లు , జాతీయ రహదారి దొంగ రవిపాలెం సెంటర్ నుండి సిద్ధాంతం శివారు ఘటాల దిబ్బ వరకు సెంట్రల్ లైటింగ్, అవసరమైనచోట్ల ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. అలాగే ఘటాల దిబ్బ నుండి నాగదేవత గుడి వరకు ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణం కొరకు రూ 1.10 కోట్లు, అయ్యప్పస్వామి గుడి నుండి పుష్కరఘాట్లు వరకు రోడ్ నిర్మాణం చేయుట కొరకు రూ. 1.35 కోట్లు నక్కావారిపాలెంలో బ్యాంక్ కెనాల్ గట్టుపై సిసి రోడ్డు మరియు రిటైనింగ్ వాల్ నిర్మాణం కొరకు రూ. 75.00 లక్షలు, అంతేకాకుండా గ్రామములో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కొరకు రూ.12.00 కోట్లు, గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కొరకు రూ.1.00 కోటి రూపాయలు మంజూరు చేయవలసిందిగా సభలో పితాని కోరడంతో ఇవన్నీ దశలవారీగా నెరవేరుస్తామని సభాపూర్వకంగా హామీ ఇవ్వడంతో సిద్ధాంతం గ్రామస్తులు హర్షధ్వానాలు వెళ్ళబుచ్చారు.

## సూపర్ సిక్స్ ఎక్కడ చంద్రబాబూ. . మాజీ మంత్రి కారుమూరి



**తణుకు, జూన్ 8 ( ప్రభాత వార్త)** సూపర్‌సిక్స్ కంటే అదనంగా మరిన్ని పథకాలు అమలుచేశానని చంద్రబాబు వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. చెప్పిన హామీలు అమలుచేయడంలేదంటూ ఈ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్ని దుర్భాషలాడుతున్నారో వారి మధ్యకు వెళ్తే తెలుస్తుందని విమర్శించారు. తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్‌లో ఉన్న నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి ఇచ్చారా అని నిలదీశారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తానని చెప్పి ఒకటో రెండో ఇచ్చి చేతులు దులుపుకున్నారని, తల్లికి వందనం కూడా పూర్తిస్థాయిలో ఇవ్వలేదని విమర్శించారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు ఇస్తానన్న హామీలు అమలుచేయకుండా, ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించిన వారిపై దాడులు, వేధింపులు, హత్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. ల్యాండ్ టైటిల్ విధానాన్ని బూచిగా చూపిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై విషప్రచారం చేశారని, ఇప్పుడు మీరు చేసేది ఏంటని నిలదీశారు. ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తూ మాజీ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అన్ని పథకాలను నిలిపివేసి కనీసం 17 మెడికల్ కళాశాలలను కూడా అందుబాటులోకి తీసుకురాలేకపోతున్నారని అన్నారు. అన్ని రకాల రైతాంగాన్ని నిర్వీర్యం చేసి కిట్టుబాటు ధరలు లేకుండా చేశారని, ముఖ్యంగా ఆక్వా రైతాంగం పూర్తిగా రోడ్డున పడిపోయినా ఇంతవరకు చంద్రబాబు సర్కారు చలించకపోవడం దుర్మార్గమని అన్నారు. ఆక్వా రైతులు రొయ్యలను రోడ్డుపైన పారవేసి నిరసన తెలిపే స్థితికి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఆక్వా ఫీడ్‌కంట్రోలర్‌తోపాటు అధికారులతో కలిపి చర్చించి సమస్యను పరిష్కరించే దిశగా కృషిచేయకపోవడం శోచనీయమన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాల్లో పేకాటను చేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కిందని అష్టాచెమ్మా, గూటిబిళ్ల వంటి ఆటలను కూడా చేర్చాలంటూ ఎద్దేవా చేశారు. అసలైన అభ్యర్థులకు అన్యాయం జరిగేలా డీఎస్సీని మార్చేశారని మండిపడ్డారు. రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేసే విధంగా దళారీ వ్యవస్థను పెంచి పోషిస్తున్నారని,గన్ని బ్యాగ్‌లు ఇవ్వగలిగారా, రవాణా చార్జీలు ఇచ్చారా, పంటను ఈ క్రాప్ ఎందుకు చేయలేదంటూ నిలదీశారు. రాష్ట్ర వ్యాప్తంగా లిక్కర్ మాఫియా కోరలు చాచిందని, ప్రజాప్రతినిధులు, సిండికేట్‌లు బాటిల్‌పై రూ. 30 నుంచి రూ. 70 వరకు పేదల నుంచి దోచేస్తున్నారని, ఈ దోపిడీలో తణుకు రెండు మూడు స్థానాల్లో నిలుస్తుందని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, లీగల్‌సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెలగల సాయిబాబారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లా టిడిపి ప్రభుత్వానికి వెన్నెముక : సీఎం చంద్రబాబు

**పెనుగొండ, జూన్-08, (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా టిడిపి ప్రభుత్వానికి వెన్నుముక అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామం రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కుల రక్షణకు, భూ రికార్డుల ప్రక్షాళనకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమానికి వేదికైంది. సోమవారం నిర్వహించిన ఈ రాష్ట్రస్థాయి కార్యక్రమం ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు రాజముద్రతో కూడిన అత్యాధునిక భద్రతా లక్షణాలున్న పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసి, భూ హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. భారీ ప్రజాసభను ఉద్దేశించి మాట్లాడిన ముఖ్యమంత్రి, రాష్ట్రవ్యాప్తంగా భూముల పునఃసర్వే, భూ రికార్డుల నవీకరణ, యాజమాన్య హక్కుల ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్లు వెల్లడించారు. గత పాలనలో భూ రికార్డుల్లో చోటుచేసుకున్న లోపాలు, వివాదాలు, అవకతవకలను సరిదిద్దేందుకు ప్రభుత్వం రెండేళ్లుగా నిరంతర కృషి చేసిందన్నారు. 90 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాల లక్ష్యం రాష్ట్రవ్యాప్తంగా 6,688 గ్రామాల్లో పునఃసర్వే పూర్తి చేసి ఇప్పటికే 26.46 లక్షల మంది భూ యజమానులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. మరో 62.32 లక్షల పుస్తకాలను త్వరితగతిన పంపిణీ చేసి మొత్తం 90 లక్షల మంది భూ యజమానులకు వివాదరహిత భూ హక్కుల ధ్రువపత్రాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భూమి యాజమాన్య సమాచారాన్ని మరింత భద్రంగా ఉంచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని, ప్రత్యేక గుర్తింపు సంకేతాలు, త్వరిత స్పందన సంకేతాలు, పటిష్ఠ భద్రతా ప్రమాణాలతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని వెల్లడించారు. పాత భూ రికార్డులన్నింటినీ డిజిటలీకరణ చేసి ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. సేవా ఇనాం భూములు, షరతులతో కూడిన పట్టా భూములు, వివాదాస్పద భూముల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ హక్కుదారులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థలో పారదర్శకత పెంచడంతో పాటు రైతులకు చెల్లింపులు వేగంగా జరిగే విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలో ఆక్వా రంగం కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నారాయణ నాయకర్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ దాసిరాజు, ఏలూరు రేంజి ఐ.జి జి.వి.జి. అశోక్ కుమార్ , జిల్లా పోలీస్ సూపర్డెంట్ అద్నాన్ నయీమ్ , నరసాపురం డి.ఎస్.పి ఎం. సుధాకర్ రావు, పెనుగొండ సీ.ఐ. రాయుడు విజయ్ కుమార్, పోలీస్ శాఖ సిబ్బంది,జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాది మంది రైతులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.





### సమస్యలు పరిష్కరించాలంటూ
# వీఆర్వోలు నిరసన ప్రదర్శన.




**లింగపాలెం జూన్ 8 (ప్రభాతవార్త )**అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపుమేరకు లింగపాలెం మండల రెవెన్యూ కార్యాలయం ఎదురుగా మండలంలోని విఆర్వోలు విలేజ్ సర్వేర్లు వీఆర్ఏలు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు ఈ సందర్భంగా మహ మహమ్మద్ హుస్సేన్ విఆర్ఓ మర్రానికి కారణమైన అధికారులపై చర్యలుతీసుకోవాలని పని భారం వెంటనే తగ్గించాలి కేవలం రెవెన్యూ విధులే కేటాయించాలని చనిపోయిన విఆర్ఓ కు ఆర్థిక సాయం అందించిన చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు నినాదాలు చేశారు ఈనెల 11వ తేదీన రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద దర్నాలు తెలియజేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు.కె వేణుగోపాలరావు డివిజన్ కార్యదర్శి కే శ్రీనివాసరావు. కార్యదర్శి దాసరి. రంగారావు. కోశాధికారి దాసరి లక్ష్మీనారాయణ గ్రామ సర్వేర్ల సంఘం అధ్యక్షులు. కుమార్ రాజా. వీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎస్కే ఫకీర్. వీఆర్వోలు పాల్గొన్నారు.

## జీలుగుమిల్లి, ములగలంపల్లి కార్యదర్శులు బదిలీ

**జీలుగుమిల్లి, జూన్-08, (ప్రభాతవార్త)**
మండలంలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ప్రమోషన్ పై బదిలీ అయినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కే వెంకటలక్ష్మి తెలిపారు. వీరిలో మండల కేంద్రం జీలుగుమిల్లి పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న పాలడుగుల అశోక్ గ్రేడ్-03 కార్యదర్శి నుండి గ్రేడ్-02 కార్యదర్శిగా టీ నర్సాపురం మండలం మక్కినవారిగూడెంకు ప్రమోషన్ పై బదిలీ అయినట్లు తెలిపారు. అదేవిధంగా ములగలంపల్లి పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న కంభంపాటి ప్రియాంక గ్రేడ్-03 నుండి గ్రేడ్-02 కార్యదర్శిగా టీ నర్సాపురం మండలం కేతవరం సచివాలయానికి బదిలీ అయినట్లు తెలిపారు. అశోక్, ప్రియాంక రిలీవ్ కాగానే జీలుగుమిల్లి, ములగలంపల్లి పంచాయతీ కార్యాలయాలకు ఇన్చార్జి కార్యదర్శులను నియమిస్తామని తెలిపారు.

## దాతల సహకారంతో అభివృద్ధి



**కాళ్ళ జూన్ 8 (ప్రభాతవార్త)** దాతల సహకారంతో అభివృద్ధి జరుగుతుందని ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అడ్డాల శివరామరాజు అన్నారు. మండలంలోని కాళ్ళకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి-దేవాలయం చుట్టూ మాడవీధులు విస్తరణలో భాగంగా స్థలం కొనుగోలు నిమిత్తం కీ.శే. వేగేశ్న ఉదయ బాస్కర రాజు జ్ఞాపకార్థం మేనమామ, మేనత్త తాడిపూడికి చెందిన కూచంపూడి సూర్యనారాయణ రాజు, వెంకట నర్సమ్మ దంపతులు రూ. 50,000/- దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ కుమార్ పాలకమండలి అధ్యక్షులు అడ్డాల శివరామరాజులకు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## చంద్రబాబు రెండేళ్ల సర్కార్ పై అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం




**తణుకు, జూన్, 8 ( ప్రభాత వార్త)** చంద్రబాబు సర్కారు ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్నికల ముందు ప్రజలకు ఇస్తానన్న హామీలు నెరవేర్చకుండా వెన్నుపోటు పొడిచిన వైనాన్ని రౌండ్ టేబుల్ సమావేశం తీవ్రంగా విమర్శించింది. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో సోమవారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం రెండేళ్ల వెన్నుపోటు పాలనను ముక్తకంఠంతో దుమ్మెత్తిపోసింది. సూపర్‌సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను వంటి పథకాలు ఏం చేశారంటూ అఖిలపక్ష నాయకులు మండిపడ్డారు. ఈ పథకాలన్నీ ఇవ్వకపోగా సూపర్‌సిక్స్ అమలుచేసేశామంటూ తమకు అనుకూలమైన ప్రసార సాధనాల్లో ప్రచారం చేయించుకుంటున్నారంటూ విరుచుకుపడ్డారు.

**రెండేళ్లుగా వెన్నుపోటు..**

ఎన్నికల ముందు ఇస్తానన్న హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు సర్కారు గత రెండేళ్లుగా వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి మ్యానిఫెస్టోని బైబిల్, ఖురాన్, భగవద్గీతలా భావించి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి రాష్ట్రం అన్ని విభాగాల్లోను ముందువరుసలో ఉండేలా పరిపాలన చేశారని గుర్తుచేశారు.

**అధికారమే లక్ష్యంగా మోసపూరిత హామీలు..**

అధికారమే లక్ష్యంగా సూపర్ సిక్స్ హామీలతో మెరుగైన సంక్షేమం అందిస్తామంటూ మ్యానిఫెస్టోలో పొందుపరచి కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. వైఎస్సార్‌సీపీ, కమ్యూనిస్టు, వివిధ పార్టీల పోరాటాలతోపాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మీరు ప్రైవేటుపరం చేసినా తరువాత వచ్చిన ప్రభుత్వం ఆయా కాంట్రాక్టులను రద్దుచేస్తామని చెప్పడంతో కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గిందని అన్నారు.

**రాష్ట్రం, కేంద్రంలో రాక్షస పాలన..**

రాష్ట్రం, కేంద్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిర్శిపో రామకృష్ణ అన్నారు. ఎన్నికల ముందు ఇస్తానన్న హామీలు ఈ రెండేళ్ల కాలంలో నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేశారని విమర్శించారు.

**చంద్రబాబు సర్కారు వేధింపులపై ఫొటో గ్యాలరీ..**

చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా తణుకు పద్మశ్రీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం వేదికలో ఏర్పాటుచేసిన ఫొటో గ్యాలరీలో చంద్రబాబు సర్కారు చేసిన కుట్రలు, కుతంత్రాలు, దాడులు, హత్యలు, వేధింపులకు అద్దం పట్టాయి. దీంతోపాటు వివిధ రకాలుగా ప్రజల్ని మోసం చేసిన ఫొటోల రూపంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చూసిన రైతు సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, యువతను కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, పంచాయితీరాజ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, లీగల్‌సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెలగల సాయిబాబారెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విద్యార్థులకు జ్ఞాన కేంద్రాలు



**మండవల్లి జూన్ 8 (ప్రభాతవార్త)** విద్యను అభ్యసించే బాల బాలికలు తమ భవిష్యత్ ప్రణాళికలో గ్రంథాలయం ఒక నిఘంటువులా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటుందని దాని ద్వారా ఉన్నత శిఖరాలు విద్యార్థులు చేరుకోవడానికి దోహద పడుతుందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.ఎస్. భాస్కరరావు,సుధామ ఫౌండే షన్ మండవల్లి వ్యవస్థాపకుడు డా. సుధాబత్తుల విజ యకుమార్,టి.అప్పారావు పేర్కొన్నారు.మండవల్లి శాఖ గ్రంథాలయంలో ఏప్రిల్ 22నుండి జూన్ 6వ తేదీవ రకు 40 రోజులు జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిర ము ముగింపు కార్యక్రమం శనివారం గ్రంథాలయ లైబ్రే రియన్ షేక్ పర్వీన అధ్యక్షతన జరిగింది.విజ్ఞాన శిబిరంలో వివిధ కార్యక్రమాల్లో శిక్షణ ఇచ్చినవారు మాట్లాడుతూ సమాజాభివృద్ధి,బాలబాలికల్లో పఠనాభి రుచి పెంపొందించేందుకు,మనిషి మహన్నతుడుగా తీర్చిదిద్దటంలో గ్రంథాలయాలు కీలక పాత్ర వహిస్తున్నాయని, గ్రంథా లయాలు ప్రతి ఒక్కరికి ఉపయోగపడే సాధనాలని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిత్రలేఖనం,పెయింటింగ్,బొమ్మలుతయారుచేయుట,క్విజ్,చెస్,మొదలగు ఆటపాటల పోటీలలో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతు లు అందజేశారు.విజయజకుమార్,అప్పారావు,భాస్క రరావు హార్దిక సహాయంతో బహుమతులు అందించటం జరిగిందని లైబ్రేరియన్ తెలిపారు.ముగింపు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు.వివిధ కార్యక్రమాలలో శిక్షణ ఇచ్చిన భాస్కరరావు,విజయ కుమార్,అప్పారావు,చందాన దీపిక, సిహెచ్ సాయి ల కు కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ వారు పంపిన ప్రశంసా పత్రాలను గ్రంథాలయ అధికారిని ద్వారా అందించి అభినందించారు.

### మండవల్లి పోస్ట్ ఆఫీస్లో
## ఆధార్ సేవలు పునరుద్ధరించాలి



**మండవల్లి జూన్ 8 (ప్రభాతవార్త)**
మండల కేంద్రమైన మండవల్లి పోస్ట్ ఆఫీస్లో ఆధార్ కేంద్రం 2 సంవత్సరముల నుండి నిలుపుదల (రద్దు) చేయటం వల్ల ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లా ల్సి వస్తుంది.భగభగ మండే ఎండల్లో గంటల తరబడి ప్రయాణించాల్సి రావటంతో ప్రయాణ ఖర్చులు తడిసి మోపుడు అవుతున్నాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐ క్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్. ఎస్.భాస్కరరావు, జిల్లా కన్వీనర్ టి.అప్పారావు,యు టిఎఫ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్స్ చిరిగిరి పిచ్చోడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండవల్లి తాసిల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ బాజీ సత్యనారాయణకు వినత పత్రం అందించి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధార్ లో పేరు,పుట్టిన తేదీ,అడ్రస్, మొబైల్ నెం బర్,అమ్మఒడి అప్డేట్,స్కాలర్షిప్పు,పరీక్షల దరఖాస్తులు తదితర విద్యా సంబంధిత పనులకు ఆధార్ అత్యవసరం.మండవల్లి లోని 29 గ్రామపంచాయతీలకు ప్రధా నమైన మండవల్లి పోస్ట్ ఆఫీసులో సుమారు 2 సంవత్సరాల క్రితం ప్రత్యేకమైన ఆధార్ కౌంటర్ ఏర్పాటు ఉంది.అయితే టెక్నీషియన్ లేదని రెండు సంవత్సరాల నుండి ఆధార్ సేవలను నిలిపివేశారు.దీనితో 10 నుండి 30 కిలోమీటర్ల దూరంలోని కైకలూరు,గుడివాడ పోస్ట్ ఆఫీస్లకు, రోజువారి పనులు వదులుకొని ప్రజలు,ముఖ్యంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు వెళ్లాల్సి వస్తుంది.పరిమి తమైన కేంద్రాలు ఉండటం వల్ల అక్కడ విపరీతమైన రద్దీ క్యూలైన్లు ఉండి విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.విద్యుత్తు లేదని,సర్వర్లు పనిచేయటంలేదని చెప్పుతుండటంతో,రోజులు తరబడి తిరగాల్సివస్తుందని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారన్నారు.పాఠశాలలు తిరిగి ప్రారంభోత్సవం అవుతున్న సందర్భంగా పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే ఆధార్ సేవలను మండవల్లి పోస్ట్ఆఫీస్ లో అందుబాటులోనికి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.రి


## చదువుల తల్లికి ఘన సత్కారం



**చాట్రాయి, జూన్ 8,ప్రభాతవార్త** మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన అడ్డగట్ల కవిత చిన్నంపేట జడ్పీహెచ్ హైస్కూల్లో పదో తరగతిలో మండల ప్రథమ స్థానం సాధించినందుకు సిపిఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం చాట్రాయి మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్సీ సెల్ నాయకులు కొమ్ము సుజాన్ రావు మాట్లాడుతూ 20 సంవత్సరాలు తలదించుకుని చదివితే 80 సంవత్సరాలు తల ఎత్తుకొని జీవిస్తారని కృషి పట్టుదల విద్యార్థికి అవసరమని అలాంటి కృషి పట్టుదలతో చదివి చిన్నంపేట గ్రామానికి ఆదర్శవంతంగా నిలిచినటువంటి పరస కవితా రాణి భవిష్యత్తులో మునుముందుకు వెళ్లాలని ఉన్నత చదువులు అభ్యసించి చరిత్రను తిరగరాయాలని కోరుతూ 2000 రూపాయలు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా బుడుపుల రామకృష్ణ మాట్లాడుతూ చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి తల్లి యొక్క కష్టార్జితాన్ని గుర్తించి ఎంతో కష్టపడి చదివిన కవితకు మంచి భవిష్యత్తు ఉందని తాను చిన్నప్పుడే తల్లిని కోల్పోయానని ఆదరణ కరువైందని అయినా కృషి పట్టుదల ధైర్యంతో చదివి ముందుకొచ్చి పదిమందికి సహాయపడుతున్నానని అదే నేను లక్ష్యంగా ఎంచుకొని దేవుడు నాకు మంచి ఉద్యోగాన్ని ఇచ్చారని నువ్వు కూడా అలా చదివి అలా ముందుకు వచ్చి పొరుగు వారికి సాయపడ ఓయ్ అని సందేశం ఇచ్చిన గురుజాడను ప్రతి ఒక్కరు స్పందించుకోవాలని ఆయన బాటలో నడవాలని నేను అలానే నడుస్తున్నానని ప్రజలకు పిలుపునిచ్చారు.అనంతరం పదివేల రూపాయల ఆర్థిక సహాయం బుడుపుల రామకృష్ణ కవితకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడ్డగట్లగట్ల సతీష్ భాను మాస్టర్ మరియు చిన్నంపేట మహిళా టైలర్స్ యూనియన్ నాయకులు తాటిచెర్ల సుబ్బలక్ష్మి అడ్డగట్ల సుధారాణి పరస చెన్నమ్మ గ్రామస్తులు పాల్గొని కవితను ఆశీర్వదించారు.

## యాప్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయండి

### వ్యవసాయ అధికారి శివశంకర్



**చాట్రాయి, జూన్ 8, ప్రభాతవార్త**
చాట్రాయి మండలంలోని రైతులకు ఏ పి ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా యూరియా మరియు డిఏపి ఎరువులను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి బి శివ శంకర్ అన్నారు.ఈ విధానం ద్వారా సాగు చేసే ప్రతి వ్యవసాయ భూమికి ఎరువులను ఇవ్వబడుతుందని ఖరీఫ్ సీజన్ లో ఈ పంట నమోదు చేసిన రైతులు,కౌలు రైతులకు మరియు రైతుల వివరాలు రెవెన్యూ పోర్టల్ లోని డేటా అనుసంధానంతో ప్రతి సాగు చేసే రైతుకి అందించడం జరుగుతుందన్నారు. యాప్ ద్వారా మన మండలంలోని అన్ని సహకార సంఘాలను,డీలర్లను అనుసంధానం చేయబడినదని చెప్పారు. రైతుకు అందించే ఎరువులు దపాలు వారీగా ఇవ్వబడుతుందని రైతులు అందరికీ వెబ్లాంట్ లేని యెడల భూమి వివరాలను ఎం ఏ ఓ మరియు వి ఏ ఏ/ వీహెచ్ఏ ల ద్వారా వివరాలు నమోదు చేసుకుని కూడా సౌకర్యం కల్పించబడిందన్నారు. కావున రైతులు యాప్ ద్వారా ఓటిపి విధానంలో సహకార సంఘాలలో లేదా ప్రైవేట్ షాపుల వద్ద పొందాలని ఆయన కోరారు. అంతేకాకుండా సాగు దారులు పంట పంట మార్చుకోవాలన్నా సర్వే నెంబరు రాకపోయినా ఏపీ ఏఐఎంఎస్ యాప్ నందు యాడ్ చేసుకొనే అవకాశం ఉందన్నారు. కావున రైతులు మీ గ్రామంలోని రైతు సేవ కేంద్రం వద్ద తమ వివరాలను సరిచూసుకోవాలని తెలియజేశారు.

### యాప్ ద్వారా యూరియా డిఏపి
## అమ్మకాలు ప్రారంభం

**ఆగిరిపల్లి జూన్ 8 ప్రభాతవార్త** రైతులకు యూరియా, డి ఏ పి అమ్మకమును కృష్ణవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘము లో సోమవారం ప్రారంభించినట్లు మండల వ్యవసాయాధికారి జె. భవాని తెలియచేసారు. వ్యవసాయేతర అవసరాలకు దారి మళ్లకుండా, అవసరమైన రైతులకు శాస్త్రవేత్తలు సూచించిన ఎరువుల మోతాదు ప్రకారము రైతులకు అందించటం జరుగుతుందని తెలియచేసారు. ప్రతి రైతుకు తాను వేసిన పంటకు ఎంత మోతాగులో ఎరువు అవసరమవుతాయి అనేదాన్ని బట్టి ఎరువులు అందించడం జరుగుతుందని తెలియచేసారు. కౌలు ర్థులు కూడా తమ వివరాలు ఉన్నాయా లేవా అని రైతు సేవా కేంద్రాలలో సరి చూసుకోవాలని తెలియచేసారు. ప్రతి రైతుకు ఎంత యూరియా వస్తుంది అనేది యాప్లో కనపడుతుంది ఆ సిఫారసు మేరకుఎరువు మూడు విడతలుగా అందించటం జరుగుతుంది అని తెలియ చేశారు. రైతు ఆ మోతాదు లో ఎంత అవసరము అనుకొనే ఆ మేరకే కొనుగోలు చేయవచ్చని తెలియచేసారు. ఈ కార్యక్రమము లో కృష్ణవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘము అధ్యక్షులు శ్రీనివాసరావు , సిఈవో బి. మధు గ్రామ వ్యవసాయ సహాయకులు శివాజీ, రవికిరణ్ తదితరులుపాల్గొన్నారు.

## నూజివీడు పట్టణంలో డాక్యుమెంట్ రైటర్ ఆత్మహత్య



**నూజివీడు, జూన్08 ప్రభాతవార్త:** నూజివీడు పట్టణంలో ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ షేక్ సుభాని ఫ్యానుకు ఉరి వేసుకుని సోమవారం మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న నూజివీడు రూరల్ సీఐ ఐవీ నాగేంద్ర కుమార్, పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటన పట్టణంలో తీవ్ర సంచలనం కలిగించింది. సంతాప సూచకంగా పెన్డౌన్ చేసిన డాక్యుమెంట్ రైటర్స్:
డాక్యుమెంట్ రైటర్ షేక్ సుభాని ఆత్మహత్యతో మృతి చెందిన కారణంగా తోటి డాక్యుమెంట్ రైటర్స్ సంతాపం ప్రకటించారు. డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ అలీ అబ్బాస్ మాట్లాడుతూ నిన్నటి వరకు తమతో డాక్యుమెంట్ రైటర్ గా నవ్వుతూ.. నవ్విస్తూ... విధులు నిర్వర్తించిన సుభాని అనుకోని రీతిగా ఆత్మహత్య చేసుకుని మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి మృతికి సంతాప సూచకంగా పెన్ డౌన్ కార్యక్రమంలో భాగంగా విధులు నిలిపివేసినట్లు స్పష్టం చేశారు. సుభాని ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## ఆఫీసర్లు రారు.. సమస్యలు తీరవు

### కామవరపుకోటలో 'ప్రజా వేదిక' అభాసు!

**ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చిన మండల కార్యాలయం**

**అర్జీదారుల తీవ్ర ఆగ్రహం.. ఉన్నతాధికారుల చర్యలకు డిమాండ్**



**కామవరపుకోట, జూన్ 8 (ప్రభాతవార్త):** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే పరమావధిగా ప్రభుత్వం అత్యంత ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'కార్యక్రమానికి కామవరపుకోట మండలంలో అధికారులు ముఖం చాటేశారు. సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరు కావాల్సిన పలువురు అధికారులు తమ బాధ్యతలను విస్మరించి,నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రజా వేదిక కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన కీలక అధికారులు హాజరుకాకపోవడం గమనార్హం. మొత్తం అధికారులలో కేవలం 14 మంది మాత్రమే హాజరుకావడంతో ఈ కార్యక్రమం నామమాత్రంగా సాగింది.ప్రజలకు నిత్యం అవసరమయ్యే మెడికల్ ఆఫీసర్, ఇరిగేషన్,వెటర్నరీ, ఎండోమెంట్,కో-ఆపరేటివ్ సొసైటీ, వంటి అత్యంత కీలకమైన శాఖల అధికారులు ఈ సమావేశానికి దుమ్మా కొట్టారు.దీంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. మండలంలోని నలుమూలల ఉన్న మారుమూల గ్రామాల నుండి సైతం ఎంతో మంది బాధితులు తమ సమస్యలు తీరుతాయనే గట్టి నమ్మకంతో, చేతిలో అర్జీలు పట్టుకుని ఉదయాన్నే వచ్చిన తీరా అక్కడికి వచ్చాక సంబంధిత శాఖ అధికారులు లేకపోవడంతో అర్జీదారులు తీవ్ర నిరాశకు గురు అవుతున్నారు.ప్రజా వేదికను అభాసుపాలు చేస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### భీమవరం ప్రకాశం చౌక్
## నామకరణానికి 90 ఏళ్లు



**భీమవరం జూన్ 8 ప్రభాతవార్త** సుదీర్ఘ చరిత్ర కలిగిన భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్ నామకరణానికి 90 ఏళ్లు పూర్తి అయ్యాయని, 1936లో మొట్టమొదటి సారి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు భీమవరం విస్సాకోడేరు వచ్చారని, అప్పట్లోనే 12 సార్లు పాదయాత్రగా భీమవరం వచ్చారని పలువురు వక్తలు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో సోమవారం ప్రకాశం పంతులు విగ్రహ సాధన కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 90 ఏళ్ల క్రితం ఈ ప్రాంతానికి ప్రకాశం పంతులు వచ్చారని, అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని భీమవరం ప్రకాశం చౌక్ గా నామకరణం చేశారని, నేటికి 90 ఏళ్లు పూర్తి అయ్యాయన్నారు. చెరుకువాడ వెంకట సుబ్బారావు, దండు మామ, చించినాడ తాతమ్మ, మద్దాల బాలాజీ, చెరుకువాడ వెంకట రమణ మూర్తి, ఆవుపాటి సుబ్బారావులు విస్సాకోడేరు వద్ద ప్రకాశం పంతులకు స్వాగతం పలికారని, ఆయనకు భీమవరం తో అవినాభావ సంబంధాలున్నాయని అన్నారు. కమిటి సభ్యులు చెరుకువాడ సంతోష్, అరసవల్లి సుబ్రమణ్యం, ఎద్దు ఏసుపాదం మాట్లాడుతూ అందరూ సహకారంతో త్వరలోనే మహనీయుని విగ్రహాన్ని ప్రకాశం చౌక్ లో ఆవిష్కరించునున్నామని అన్నారు. కార్యక్రమంలో నందమూరి రాజేష్, విజ్జురోతి రాఘవులు, కొండ్రు శ్రీనివాస్, ఎస్ కే చాన్ భాషా పాల్గొన్నారు.

### రైల్వే స్టేషన్ రోడ్డులో
## ఆక్రమణలు తొలగించాలి

### ఐక్యవేదిక నాయకులు వినతి



**మండవల్లి జూన్ 8 (ప్రభాతవార్త)** మండల కేంద్రమైన మండవల్లి రైల్వే స్టేషన్ నుండి అయ్యవారి రుద్రవరం పీదరు రోడ్డు వరకు సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు కోరారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ కె. బాజీ సత్యనారాయణ కు ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ తెంటు అప్పారావు, జిల్లా కో కన్వీనర్ వై. శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. రైల్వే శాఖ వారు మండవల్లి గ్రామపంచాయితీ వారు, జాయింటు ఇన్స్పెక్షన్ నిర్వహించి మండల సర్వేయరు, మరియు రైల్వే అధికారులచే సర్వే చేయించి రైల్వే స్టేషన్ నుండి అయ్యవారిరుద్రవరం రోడ్డు 1వ వంతెన వరకు గల 50 అడుగుల పీదరు రోడ్డులో పూర్తిగా ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ రోడ్డును పలువురు ఇల్లు గల గ్రామస్థులు గత కొంత కాలముగా ఆక్రమించి యధేశ్చగా అనుభవించుచూ, రోడ్డుపై రాకపోకలకు పూర్తిగా ఇబ్బందులు కలిగించుచున్నారని వాపోయారు. దీనిపై సంబంధిత రెవిన్యూ, మరియు గ్రామపంచాయితీ, మరియు రైల్వేశాఖ అధికారులు ఏలూరు జిల్లా కలెక్టరు సమక్షములో జాయింటు ఇన్స్పెక్షన్ నిర్వహించి, ఆక్రమణలు తొలగించి సంబందిత ఆక్రమణదారులపైన ల్యాండ్ గ్రాబింగ్ మరియు లాండ్ ఎన్క్రోచ్మెంటు చట్టాలు ద్వారా చర్యలు తీసుకొనగలరని కోరారు. ప్రజలు కొరకు రైల్వే స్టేషన్ యొక్క గోడగాని ముఖద్వారం గాని సరిగ్గా కనిపించడంలేదు. మరియు జాతీయ రహదారి నుండి రైల్వే స్టేషన్ యొక్క డైరక్షన్ బోర్డును రైల్వేవారు నేటి వరకు ఏర్పాటు చేసియుండలేదు. మరియు ఆక్రమణలు తొలగించి జాతీయరహదారి మొదటి భాగములో నియమ నిబంధనలు పాటించుచూ రైల్వే ప్రయాణికులు కొరకు చిన్న కనీసం బస్సు షెల్టరును ఏర్పాటు చేయవలసినదిగా పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రైల్వే స్టేషన్ మండవల్లి మండల హెడ్ కోర్టర్లో ఉండియున్నది. ఆక్రమణలు వలన రైల్వే రోడ్డుపై మోకాలు లోతు నీరు నిల్వ ఉంటుందని ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించవలసినదిగా వినతిపత్రం అందజేశారు.

## స్వచ్ఛ రథం కార్యక్రమానికి ప్రజల విశేష స్పందన




**మొగల్తూరు జూన్ 8 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ రథం కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని రామన్నపాలెం గ్రామపంచాయతీలో సోమవారం స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో సి.హెచ్. త్రిశూలపాణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఇళ్ల నుంచి ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మరియు ఇతర పునర్వినియోగ వ్యర్థ పదార్థాలను సేకరించారు. సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలకు బదులుగా ప్రజలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ విధానం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత పెంపొందడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడం లక్ష్యంగా అధికారులు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, యువత మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. స్వచ్ఛ రథం కార్యక్రమం గ్రామంలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకువస్తోందని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## మొగల్తూరులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



**మొగల్తూరు జూన్ 8 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో ప్రధాన రహదారుల వెంట కొనసాగుతున్న ఆక్రమణలు ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ముఖ్యంగా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో రహదారిపై వ్యాపారులు, తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. ఫోటోలో కనిపించినట్లుగా రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా వచ్చిన సమయంలో రహదారి ఇరుకుగా మారి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బస్సులు తప్పుకునేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఆక్రమణల తొలగింపుపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని, ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై ఉన్న ఆక్రమణలను తొలగించి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రజల సహకారం ఉంటేనే
## పరిశుభ్రమైన భీమవరం సాధ్యం



**భీమవరం జూన్ 8 ప్రభాతవార్త** ప్రజల సహకారం ఉంటేనే పరిశుభ్రమైన భీమవరం సాధ్యమవుతుందని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సోమవారం జెపి రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం చుట్టుపక్కల ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా డ్రైనేజీ, రోడ్లను పరిశుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం లేకుండా పరిశుభ్రత సాధ్యం కాదని, ప్రతిఒక్కరూ తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ భాగస్వాములు కావాల న్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వేలూరి సుబ్రహ్మణ్యం, వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ గవర్నర్ వడుపు గోపి, బోండా శ్రీరామ్, శ్రీధర్, ఎంహెచ్ సోమశేఖర్, కొప్పినిడి సూర్య ప్రకాష్ సభ్యులు పాల్గొన్నారు.

## యువతి వైద్య చికిత్సకు రూ.20 వేల సాయం



**భీమవరం జూన్ 8 ప్రభాతవార్త** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రాజమండ్రి మండలం నామవరం గ్రామానికి చెందిన కుమారి రామలక్ష్మి (23), ఇప్పటికే ఒకసారి శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ మళ్లీ వ్యాధి తిరగబడిన విషయం తెలుసుకున్న కృష్ణ బలిజ, పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా. గంటా త్రిమూర్తులు ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, మెరుగైన వైద్య చికిత్స కోసం తన వంతు సహాయంగా రూ.20 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చి, రామలక్ష్మి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాసరావు, కాపా అమర్ బాబు, దువ్వ లోకేష్, కుమారి రాము, దొంగ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ నోటిఫికేషన్‌లో భారీ తప్పు:

### తహశీల్దార్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

**కామవరపుకోట,జూన్ 8(ప్రభాతవార్త):** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ పరిధిలో విడుదలైన అంగన్‌వాడీ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో దొర్లిన భారీ తప్పుపై కామవరపుకోటకి చెందిన బొబ్బిలి డాన్ దివాకర్ బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక నిరుద్యోగ మహిళలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకునేందుకు ఆయన సోమవారం కామవరపుకోట మండల పరిషత్ కార్యలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులను కలిసి పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల కేటాయింపుల్లో జరిగిన పొరపాట్లపై అధికారులకి ఒక వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బొబ్బిలి డాన్ దివాకర్ మాట్లాడుతూ.. గత నెల మే 22వ తేదీన జంగారెడ్డిగూడెం సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్ నెం. 1/ఐసిడిఎస్/2026 లో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడ్డారు. నోటిఫికేషన్‌లో క్రమ సంఖ్య 20గా ఉన్న సెంటర్ కోడ్ నెం. 0504259 స్థానంలో 'నారాయణపురం - గొల్లగూడెం' అని తప్పుగా నమోదు చేశారని ఆయన తెలిపారు. వాస్తవానికి ఆ కోడ్ గల అంగన్‌వాడీ కేంద్రం కామవరపుకోట గ్రామ పంచాయితీ పరిధిలోని 'కొండగూడెం -గొల్లగూడెం' గ్రామానికి చెందినదని, అధికారుల తప్పుగా ప్రకటన చేయడం వల్ల తమ గ్రామ అభ్యర్థులు ఉపాధి అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీ.ఓ.ఎమ్మెస్.నెం. 21, తేది 14-11-2018 నిబంధనావళిని అనుసరించి స్థానిక గ్రామ పంచాయితీకి చెందిన మహిళలకు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుందని ఆయన ఈ సందర్భంగా అధికారులకు గుర్తుచేశారు. కావున ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి,తప్పుగా వివరాలతో ఉన్న నోటిఫికేషన్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. సదరు కోడ్ నెంబర్‌కు 'కొండగూడెం -గొల్లగూడెం'గా పేరును మారుస్తూ వెంటనే సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని, అర్హులైన స్థానిక అభ్యర్థుల నుండే దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

